క్లుప్తంగా

ధైర్యంగా ఉండండి.. ఆదుకుంటా!

సలీం కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సబిత



సలీం సతీమణిని పరామర్శిస్తున్న మంత్రి సబిత

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ మైనార్టీ నేత మహమ్మద్ సలీం సతీమణికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పరామర్శించారు. సరూర్‌నగర్‌లోని సలీం ఇంటికి వెళ్లిన ఆమె.. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, మాజీ అధ్యక్షుడు అంకిరెడ్డి, రిషీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కందుకూరు: కందుకూరు గ్రామంలో శుక్రవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవం పురస్కరించుకొని కల్యాణం మరుసటి రోజు రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు పోటాపోటీగా రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నా, పెద్దా అంతా రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ చేశారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించి అమ్మవారు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్, ఆలయ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీని లోతుగా విచారించాలి

వైఎస్ఆర్‌టీపీ నాయకుడు సుమన్‌గౌడ్

పహాడీషరీఫ్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో ప్రమేయమున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర యూత్ కో–ఆర్డినేటర్ గుర్జాని సుమన్ గౌడ్ డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీని అరికట్టలేని ప్రభుత్వం.....నిరసన తెలుపుతున్న వారి పట్ల దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత్రి వై.ఎస్.షర్మిల పిలుపు మేరకు నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి తరలిన తమ పార్టీశ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం తగదన్నారు. ఈ లీకేజీ వ్యవహారం నిరుద్యోగులకు శాపంగా మారిందన్నారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించడంతో పాటు నిరుద్యోగులకు లక్ష రూపాయలు భృతి కల్పించాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు సత్కారం

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా అవార్డు అందుకున్న కొల్కులపల్లి అంగన్‌వాడీ కార్యకర్త వెంకటమ్మను శుక్రవారం సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

మహనీయులారా.. మన్నించండి

- సభలు, సమావేశాలప్పుడు మహనీయుల విగ్రహాల చుట్టూ పార్టీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు
- నేతల తీరుపై మండిపడుతున్న దళిత సంఘాలు, ప్రజలు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల ఆగడాలకు మితిమీరుతున్నాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నేతలు.. సభలు, సమావేశాలప్పుడు మహనీయుల విగ్రహాలకు గులాబీ జెండాలు, తోరణాలు కట్టి వారిని అవమానిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్వరం మండల పరిధిలోని అమీర్‌పేట గ్రామంలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్సాన్‌పల్లి చౌరస్తాలోని బీఆర్.అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాల చుట్టూ అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలు గులాబీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టారు. మన్సాన్‌పల్లి చౌరస్తాలో రోడ్డు మధ్యలో ఉన్న బీఆర్.అంబేద్కర్ విగ్రహం, స్వామి వివేకానంద విగ్రహాల చుట్టూ గులాబీ తోరణాలు, జెండాలను కట్టారు. కార్యక్రమం ముగిసి నాలుగురోజులు కావస్తున్నా ఇప్పటివరకు విగ్రహాల చుట్టూ కట్టిన గులాబీ తోరణాలను పార్టీ నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించడం లేదు. మహనీయు విగ్రహాల చుట్టూ గులాబీ తోరణాలు కమ్మేసిన దృశ్యాలను చూసిన ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. వెంటనే వాటిని తొలగించాలని కోరుతున్నారు. గులాబీ నేతలే కాదు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు కూడ వారి సభలు, సమావేశాలు జరుగుతున్న సమయంలో ఆ పార్టీల జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు చౌరస్తాల్లో ఉన్న మహనీయుల విగ్రహాల చుట్టూ తోరణాలుగా కట్టేస్తున్నారు. ఇది వారిని అవమానించినట్లేనని.. విగ్రహాలకు పార్టీల రంగుల తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలు కట్టి అవమానించొద్దని దళిత సంఘాలు, అంబేద్కర్ సంఘాలు కోరుతున్నారు.



మన్సాన్‌పల్లిలో అంబేద్కర్, వివేకానంద విగ్రహాలను కమ్మేసిన గులాబీ తోరణాలు

కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు



మరమ్మతులు చేయకుండా వదిలేసిన రోడ్డు

కందుకూరు: హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై కందుకూరు చౌరస్తాలో నెల రోజుల క్రితం రహదారిని తవ్వి కల్వర్టు నిర్మించి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ రహదారికి మరమ్మతులు చేయకపోగా ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రాత్రి వేళలో వాహనదారులు కింద పడి తీవ్రంగా గాయాలపాలవుతున్నారు. రెండు రోజుల క్రితం కల్వర్టు ప్రాంతంలో రాత్రి వేళలో భార్యాభర్తలు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం భర్త పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. దీనిపై స్పందించిన కొత్తగూడకు చెందిన లాయర్ బొక్క ఓంరెడ్డి గురువారం సాయంత్రం కందుకూరు పోలీస్ స్టేషన్‌లో కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేశాడు. పనులు అసంపూర్తగా వదిలేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కల్లు గీత సొసైటీలకు పరిహారం అందజేత

హయత్‌నగర్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తాటి చెట్లను కోల్పోతున్న కల్లు గీత సొసైటీలకు గురువారం హయత్‌నగర్ ఎక్సైజ్ అధికారులు నష్ట పరిహారాన్ని అందజేశారు. హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు ఇందుకు సంబంధించిన చెక్కులను నిర్వాహకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చింతల్‌కుంట చెక్‌పోస్ట్ నుంచి కొత్తగూడెం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా మొత్తం 142 తాటి చెట్లను తొలగించామన్నారు. దీనికి పరిహారంగా పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్టు, లష్కర్‌గూడ సొసైటీలకు కలిపి రూ. 1,39,728లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్, కల్పన, ఎస్ఐలు సరళ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి



నిధుల మంజూరు పత్రాన్ని సర్పంచ్‌కు అందిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

కందుకూరు: మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతిపాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నేదునూరులో భూగర్భడ్రైనేజీ నిర్మాణానికి జెడ్పీ నిధుల నుంచి రూ.6.50 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డికి నిధుల మంజూరు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అందరూ కలిసిరావాలని కోరారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.శమంత, ఉప సర్పంచ్ బి.శ్రీనివాస్, నాయకులు జయేందర్, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, దేవేందర్, ప్రభాకర్‌రెడ్డి, ఉన్ని వెంకటయ్య, పాండురంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఎ.నర్సింహా, అఫ్జల్‌బేగ్, రూప్‌చందర్, శ్రీధర్, పాండుగౌడ్, ఆనంద్, కార్తీక్, వెంకట్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించండి

మహేశ్వరం: వాదే ముస్తఫా బస్తీలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ సవూద్ అవల్గీ కోరారు. నహదీ హోటల్ నుంచి వాదే ముస్తఫా బస్తీ వరకు తాత్కాలికంగా రోడ్డుపై పోయిస్తున్న మట్టి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవతో ఈ రోడ్డులో ఇప్పటికే డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తుందని వాపోయారు. రానున్న వర్షకాలాన్ని దృష్టి ఉంచుకొని వెంటనే రోడ్డు పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ మైనార్టీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు సయ్యద్ అల్తాఫ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ సవూద్ అవల్గీ

నేడు కందుకూరులో ఆత్మీయ సమ్మేళనం

కందుకూరు: బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి హాజరవుతారని చెప్పారు. మండల పరిధిలోని కందుకూరు, దెబ్బడగూడ, సార్లరావులపల్లి, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి, దాసర్లపల్లితండా, నేదునూరు, బాచుపల్లి, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్, దావూద్‌గూడ, పెద్దమ్మతండా, జైత్వారం, కొత్తగూడ, కొత్తూర్ గ్రామాలకు చెందిన పార్టీకి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

భారీగా ఆస్తి పన్ను వసూలు

- ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్లలో టార్గెట్ రూ. 173 కోట్లు
- వసూలైంది రూ. 172 కోట్లు

ఎల్‌బీనగర్: ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను చెల్లింపు గడువు శుక్రవారంతో ముగిసింది. ఇచ్చిన టార్గెట్‌ల కోసం అధికారులు, సిబ్బంది విశ్వ ప్రయత్నం చేసినా ఈ సంవత్సరం మూడు సర్కిళ్ల పరిధిలో రెండు సర్కిళ్లు తమ టార్గెట్‌ను చేరుకోలేకపోయాయి. ఈ సంవత్సరం ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్నుల వసూళ్లలో ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోనే ఎల్‌బీనగర్ సర్కిల్–4 టాప్‌గా నిలిచింది. మూడు సర్కిళ్ల పరిధిలో ఈ సంవత్సరం టార్గెట్ రూ. 173 కోట్లు వసూళ్లే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు మూడు సర్కిళ్ల పరిధిలో సుమారుగా రూ. 172 కోట్ల మేరకు ఆస్తి పన్నులు వసూలైంది. మరో రూ. కోటి మేరకు ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడ్డారని తెలుస్తోంది. ఆస్తి పన్ను చెల్లింపు గడువు శుక్రవారం అర్ధరాత్రి వరకు ఉండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. శనివారం ఉదయం కల్లా లెక్కలు తెలుస్తాయని అధికారులు అన్నారు.

సర్కిళ్ల వారీగా వసూళ్లు ఇలా...

ఎల్‌బీనగర్ సర్కిల్–3లో టార్గెట్ రూ. 62 కోట్లు ,వసూలు లక్ష్యం ఇందులో సుమారు రూ. 60 కోట్లు వసూలయ్యాయి.టార్గెట్ పూర్తి కావాలంటే మరో రూ. 2 కోట్లు వసూలు కావాల్సి ఉంది. సర్కిల్–4లో ఆస్తి పన్ను లక్ష్యం రూ. 49 కోట్లు కాగా వసూలైంది రూ. 50 కోట్లు. అంటే ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడమే కాకుండా ఆదనంగా మరో రూ. కోటి చేరింది.

ప్రతి పేద కుటుంబానికి అండగా కల్యాణలక్ష్మి

విద్యాశాఖమంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రతి పేద కుటుంబంలో ఆడపిల్లల వివాహాలకు కల్యాణలక్ష్మి పెద్దదిక్కుగా మారిందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సబితారెడ్డి హాజరై, స్థానిక కార్పొరేటర్లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలకు తగ్గట్టుగానే సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. బాల్యవివాహాలకు చెక్ పెడుతూ కేసీఆర్ ఇంటికి పెద్దకొడుకులాగా మారాడని కొనియాడారు. పేదల కోసం చేపడుతున్న అన్ని పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, తహసీల్దార్ జనార్దన్‌రావు, కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు బోయపల్లి దీపిక, జెనిగె భారతమ్మ, దడిగ శంకర్, పవన్‌యాదవ్, సుర్గంటి అర్జున్, ఏనుగు రాంరెడ్డి, లిక్కి మమత, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి

ప్రజా సంక్షేమంలో తెలంగాణ టాప్

హుడాకాంప్లెక్స్: పేద ప్రజల ఇళ్ల రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వం మరో నెల రోజుల అవకాశం కల్పించిందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సరూర్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరై సరూర్‌నగర్‌కు చెందిన 17 మంది, ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన 45 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఇబ్బంది లేకుండా సీఎం కేసీఆర్ మేనమామలా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అండగా నిలిచారని చెప్పారు. ప్రజా సంక్షేమంలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. పేదలు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని ఉంటే 120 గజాల లోపు ఇంటి నిర్మాణం చేపట్టిన వారు జీఓ నం–58, 59 కింద ఏప్రిల్ 30 లోగా రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నోటరీ ఉన్నవారికి కూడా ఈ అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, ఆర్డీఓ సూరజ్, తహసీల్దార్ జయశ్రీ, ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, అంకిరెడ్డి, బేర బాలకిషన్, బాలరాజ్‌గుప్తా, మద్ది కరణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

మీర్‌పేట: రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన 55 మంది లబ్ధిదారులకు మంత్రి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం ముఖ్యమంత్రి ప్రత్యేకంగా షీటీమ్స్‌ను ఏర్పాటు చేశారని, అలాగే, కేసీఆర్ కిట్, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణలు, బాలింతలకు న్యూట్రీషన్ కిట్లు అందిస్తున్నారని అన్నారు. నూతనంగా గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు అందించనున్నట్లు మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్, తహసీల్దార్ జనార్దన్‌రావు, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మంత్రి సబితారెడ్డి

ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం

పాల్గొన్న మంత్రి సబితారెడ్డి



మంత్రి సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

కందుకూరు: మండలంలోని మీర్‌ఖాన్‌పేట రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీరాముడి పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంపీటీసీ రాములు, ఆలయ చైర్మన్ నర్సింహా, ప్రధాన కార్యదర్శి మదన్‌పాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ బి.శకుంతల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సబితారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఎంపీపీ జ్యోతిపాండు, వైస్ ఎంపీపీ శమంత, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏ శ్రీరాములు యాదవ్, డీ జంగయ్యయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ ఏ జంగారెడ్డి, కృష్ణనాయక్, మన్నే జయేందర్, లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్ మల్లేష్, మేఘనాథ్‌రెడ్డి, ఎ.సత్తయ్య వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బి.సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దేరంగుల నర్సింహా, నాయకులు చిర్ర సాయిలు, గండు నర్సింహా, జగదీష్‌బాబు, కాకి సంతోష్‌కుమార్, వెంకటేష్, శ్యాంసుందర్, శ్రీశైలం, కాకి కృష్ణ, బి.నరసింహా తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే లక్ష్యసాధన సులువే

చంపాపేట: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే గమ్యంతో పాటు ఉన్నత శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లా రఘుమారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే 120 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నులు, జామెట్రీ బాక్సులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు గుండు వెంకటేశ్వర్లు, నాయకులు గౌతంరెడ్డి, ముడుపు రాజిరెడ్డి పాల్గొన్నారు.

రూ. 77.71 కోట్లతో మీర్‌పేట బడ్జెట్

- మేయర్ అధ్యక్షతన సమావేశం
- ఇంటి పన్నులు తగ్గించాలని బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్ల ధర్నా..

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం శుక్రవారం మేయర్ ఎం దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించారు. 2023 –24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.77.71 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. సమావేశానికి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటి పన్నుల తగ్గింపు, నీటి బిల్లులు, విద్యుత్, వీధి కుక్కల కట్టడి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడంతో పాటు అక్రమ నిర్మాణాలను గుర్తించి జరిమానా విధించి కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచాలని సమావేశంలో నిర్ణయించినట్లు మేయర్ తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు తగ్గించాలంటూ ధర్నా

కార్పొరేషన్ పరిధిలో పెరిగిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, చల్లా కవిత మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే మీర్‌పేట ప్రాంతంలో పెంచిన ఇంటి పన్నులతో ప్రజలపై అధిక భారం పడుతోందన్నారు. దీంతో పాటు రోడ్లు, డ్రైనేజీ, ఇతర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కావున, ప్రతి నెల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏ శ్రీరాములు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులపై 15 రోజుల్లోగా నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ హామీ ఇవ్వడంతో కార్పొరేటర్లు ధర్నా విరమించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీ నర్సింహ, సీ మౌనిక, హరినాథ్‌రెడ్డి, కరుణానిధి, భిక్షపతిచారి, పీ శివపార్వతి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ దుర్గ, వేదికపై అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రధాన రహదారులపై బైక్ రేసింగ్‌లు

- స్పీడ్‌గా వెళ్తున్న రేసర్స్ బైకులతో ప్రజలు బెంబేలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యువకులు

దిల్‌సుఖ్‌నగర్: రోడ్లపై బైకు రేసింగ్‌పై నిషేధం ఉన్నా యువకులు మాత్రం రేసింగ్‌లను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. మలక్‌పేట్ జోన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై యువకులు నిత్యం బైక్ రేసింగ్‌లను పాల్పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై కొందరు యువకులు బైకులపై బలాదూర్‌గా తిరుగుతూ బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు.

- కొన్ని రోజులుగా యువకులు దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్ జాతీయ రహదారిపై ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా రోడ్లపై బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు. వాహనాల మధ్య నుంచి స్పీడుగా వెళ్తున్న రేసర్‌ల బైకులను చూసి రోడ్డుపై వెళ్లే వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడుగా వెళ్లే యువకులతో జాతీయ రహదారిపై వెళ్లే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నగరంలోని ప్రధాన రహదారులపై బైకు రేసింగ్‌లు ఇప్పుడు యువతలో ఒక ఫ్యాషన్‌గా మారిందనే చెప్పొచ్చు. ఆ సమయం ఎప్పుడు వస్తుందా అని బైకులు వేసుకుని రయ్‌మని దూసుకెళ్లడానికి సిద్ధంగా ఉంటున్నారు.
- ధనవంతుల బిడ్డలు వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యధిక సీసీ సామర్థ్యం ఉన్న బైకులను నగర రోడ్లపై ట్రాఫిక్ మధ్యలో నడపలేని పరిస్థితి ఏర్పడటంతో యువత రాత్రి సమయాలలో ఆ బైకులతో ఒక చోటకు చేరుకుని పందాలు వేసుకుని రేసింగ్‌లకు పాల్పడుతున్నారు. బైక్ రేసర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, భారీ బందోబస్తు ఏర్పాటు చేసి యువత రేసింగ్‌లకు పాల్పడకుండా తగిన విధంగా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రశాంతిహిల్స్–బీఎన్‌రెడ్డినగర్ రహదారికి మోక్షం



అభివృద్ధి చేసిన ప్రశాంతిహిల్స్–బీఎన్‌రెడ్డి రహదారి

ఇకపై సాఫీగా ప్రయాణం

మీర్‌పేట: ఇన్నాళ్లకు ప్రధాన రహదారికి మోక్షం.. ఇక వాహనాల రాకపోకలకు మార్గం సుగమం. వివరాల్లోకి వెళితే. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతిహిల్స్ చౌరస్తా నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని ఇటీవల విస్తరణ చేపట్టి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో ప్రజల అవస్థలకు చెక్ పడింది. ఎన్నో ఏళ్లుగా రహదారి అభివృద్ధి నోచుకోకపోగా... ప్రతి సంవత్సరం కేవలం మరమ్మతులతోనే అధికారులు సరిపెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు విస్తరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.4కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగింది. ఆరు నెలల క్రితం ముందుగా ప్రశాంతిహిల్స్ చౌరస్తా నుంచి నందిహిల్స్ చౌరస్తా వరకు సీసీరోడ్డును అభివృద్ధి చేయగా, ఇటీవల మిగిలిన రోడ్డును విజ్ఞానపురికాలనీ వరకు బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రహదారిని అభివృద్ధి చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఎన్‌రెడ్డినగర్ నుంచి మీర్‌పేట, అల్మాస్‌గూడ, బాలాపూర్ చౌరస్తాకు చేరుకోవడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో గతంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగేవని, ప్రస్తుతం ప్రయాణం సాఫీగా సాగిపోతుందని వాహనదారులు తెలిపారు.

> **లేయర్ వేయాల్సి ఉంది**
>
> 
>
> బీటీ రోడ్డుకు మరో లేయర్ వేయాల్సి ఉంది. ఆ తరువాత రహదారికి లైన్ మార్కింగ్ వేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నాం. దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.
>
> –గోపీనాథ్– డీఈ, మీర్‌పేట కార్పొరేషన్